ఈ వారం కథ

-కలశపూడి శ్రీనివాసరావు





# సంకల్పం

ఇప్పుడు కాకపోతే, మరెప్పుడు? మనం కాకపోతే మరెవ్వరు?

అమెరికా దేశంలో, మిచిగాన్ రాష్ట్రంలో, గేంజెస్ అన్న ఊరులో ఉన్న వివేకానంద మొనాస్టరీలో ఆగస్టు నెల ఆఖరు వారం కలసిన వంద మంది భారతీయులని రెండు రోజులుగా ఆలోచింపజేస్తున్న ప్రశ్నలివి.

బ్రిటీష్ పాలన నుండి రాజకీయ స్వాతంత్ర్యం సంపాదించుకొని కొన్ని ఏళ్ళు పైబడ్డా, ఎన్నో రకాలుగా వెనుకబడి, సుమారు సగానికి సగం జనం నిరక్షరాస్యతతో, కులాల కుమ్ములాటలతో, మనిషి స్వార్థపు మూర్ఖత్వానికి మతం ముసుగుతో, అన్ని రంగాలలో లజ్జలేని లంచగొండితనంతో, అధికార దాహంలో ప్రజాసేవ పేరుతో పదవులెక్కుతున్న రాజకీయ నాయకులతో, దిక్కుతోచక నిస్పృహతో నిలబడి ఉన్న సామాన్యుడికి ఉత్తేజం కలిగించే లాంటి ఉద్యమం కావాలి. అది ఇప్పుడు కాకపోతే, మరెప్పుడు?

ఆ దేశంలో పుట్టి, ఆ దేశంలో పెరిగి ఆ దేశానికి కావలసింది చెయ్యగల స్థితిలో ఉన్న మనం కాకపోతే మరెవ్వరు?

'ఎన్నో వనరులతో, శతాబ్దాలుగా స్వశక్తిపై ఆధారపడి, స్వంత బుద్ధితో, విద్యా, వ్యవసాయ, వ్యాపార రంగాలలో ముఖ్యమైన దేశంగా నిలబడ్డ భారతదేశం ఈనాడు ఇంత వెనుకబడ్డ దేశంగా ఉండనవసరం లేదు. బాధ్యతాయుతమైన భారతీయులుగా దేశం బాగుకై మీమీ పరిధులలో, మీమీ శక్తి కొద్దీ, మీరు చెయ్యగలిగినది చెయ్యండి' అన్న డాక్టర్ భాగవతుల పరమేశ్వరరావుగారి పిలుపు నందుకొని సమావేశమైన వాళ్ళ సామూహిక ఆలోచనల సారమిది.

ఆషా, ఎ.ఇ.డ్, ఐ.ఎల్.పి. వంటి సంస్థల సభ్యులు, అమెరికా దేశంలో వివిధ రాష్ట్రాలలో డాక్టర్ పరమేశ్వరరావుగారి సభలకి వచ్చిన వారి ప్రతినిధులతో ఆ ప్రదేశం నిండిపోయింది. దేశం బాగు కోసం అంతమంది కలవడం నాకు చాలా ఆనందం కలిగించింది. ఎవరి మొహంలో చూసినా ఉత్సాహం పెల్లుబుకుతున్నది. అందరికి అందరూ సుమారుగా కొత్తవారే. ఒకరిని ఒకరు పలకరించుకొంటూ, పరిచయాలు పెంచుకొంటున్నారు. సరిగ్గా అటువంటి సమయంలో నా దృష్టి ఒంటరిగా, అందరికీ దూరంగా ఉన్న ఒకతని మీద పడింది. అతన్ని నిన్న మధ్యాహ్నం భోజనాల దగ్గర కలిశాను. 'పేట్' అని పరిచయం చేసుకొన్నాడు. అతని పూర్తి పేరు వాయువేగుల పతంజలిట. విష్ణుభొట్ల రామన్నగారితో కలిసి వచ్చాడుట. మద్రాసు ఐఐటిలో ఇంజనీరింగ్, తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పిహెచ్‌డి. గత ఏడాదిగా న్యూయార్క్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అమెరికా వచ్చి ఐదేళ్ళే అయిందట. ఎక్కువమందితో పరిచయం పెంచుకొన్నట్లు లేదు. అందుకే ఒంటరిగా ఉన్నాడని దగ్గరికి వెళ్ళి పలకరించాను.

'ఏమిటీ ఇలా ఒక్కరూ ఉన్నారు?' అన్నాను.

'మా గ్రూప్ వాళ్ళు లిటరసీ పెంచడంపై డిస్కస్ చేస్తున్నారు. కానీ వాళ్ళ ఆలోచన ప్రకారం లిటరసీ పెంచడం జరగని పనని నా ఉద్దేశం' అన్నాడు.

'మరి మీ ఆలోచన ఏమిటి?' అన్నాను.

'లిటరసీ పెంచాలి. ప్రస్తుతం ఉన్న 52 శాతంతో భారత దేశం అభివృద్ధి సాధించడం జరగని పని. చిన్నచిన్న సహాయాలవల్ల ఆట్టే ప్రయోజనం ఉండదు. పెద్దఎత్తున లిటరసీ టేకప్ చెయ్యాలి' అన్నాడు.

'పెద్ద ఎత్తున అంటే...' అన్నాను వివరంగా చెప్పమన్న భావంతో.

'నాకు ఓ 1,00,000 డాలర్లు సంపాదించి, ఇండియా వెళ్ళి అక్కడ ఉన్న ఓ ఆర్గనైజేషన్‌తో కలిసి కాని, లేదా ఓ ఆర్గనైజేషన్ పెట్టి వందలకొద్దీ వాలంటీర్లని పెట్టి, వేలకొద్దీ ఇల్లిటరేట్సుని, లిటరేట్సుగా చెయ్యాలని ఉంది' అన్నాడు ఆవేశంగా.

'అది మంచి ఉద్దేశమే గానీ, ఇటువంటి విషయాలలో అంటే సంఘ సేవలో డబ్బు కోసమో, ఎదుటివారి కోసమో ఎదురు చూడటం అనసరం. పైగా ఆ డబ్బు కాని, మనుషులు కాని సమకూరేసరికి పని చెయ్యడానికి కావలసిన అనుభవం రావాలంటే ఊహ తోచిన నాటి నుండి ఎంతలో వీలయితే అంతలో, పని చేయడం మొదలుపెట్టాలి'

'కానీ ఫలితం?' అన్నాడు ప్రయోజనం ఉండదన్న భావంతో.

ఈ ప్రశ్నకు సమాధానం ఎలా చెప్పాలని ఆలోచిస్తుంటే, సమాధానం నా చేతుల్లోనే ఉన్నట్టు తోచింది. వెంటనే 'మీరు తెలుగు చదువుతారా?' అని అడిగాను.

'ష్యూర్' అన్నాడు.

'అయితే నా స్వంత అనుభవాన్ని ఓ కథ రూపంలో రాశాను. ఈ కథ చదవండి. మీ ప్రశ్నకు సమాధానం దొరకవచ్చు' అని నేను రాసిన కథ కాపీ అతనికిచ్చాను.

ఇంతలో డాక్టర్ రాణి చింతంగారు రమ్మంటున్నారని నాకు కబురు వచ్చింది.

'ఓ అరగంట తరువాత వచ్చి కలుస్తాను' అన్నాను.

'చాలా థేంక్స్. ఇప్పుడే చదువుతాను' అని అతను అక్కడే కూర్చొని చదవటం మొదలెట్టాడు.

★★★

1998 జనవరి మొదటి వారంలో భువనేశ్వర్ వెళ్ళాం నేను, నా భార్య చిత్రం. చిన్నప్పుడు నాతో కలిసి చదువుకొని, పాతికేళ్ళుగా అక్కడే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న కిషోర్, అతని భార్య కమల ఉదయాన్నే రైల్వేస్టేషన్‌కు వచ్చి మమ్మల్ని ఆదరంగా వాళ్ళింటికి తీసుకువెళ్ళారు.

'కిషోర్! ఈ మాటు కోణార్క్ తప్పకుండా వెళ్ళాలి' అన్నాను కబుర్లలో.

'తప్పకుండా. కానీ మరీ రెండు రోజులే ఉంటానంటే ఎలారా?' అన్నాడు.

'రేపే వెళదాం. మీరిద్దరూ కూడా రండి. అందరం కబుర్లు చెప్పుకుంటూ హాయిగా గడుపుదాం' అన్నాను.

'సరే. అయితే ఉదయాన్నే నాలుగు గంటలకి బయల్దేరితే సూర్యోదయానికల్లా కోణార్క్ చేరుకోవచ్చు. అప్పుడయితే ప్రశాంతంగా ఆ గుడిని, గుడి వెనుకగా సూర్యోదయాన్ని చూడొచ్చు అన్నాడు కిషోర్ తన్మయత్వంతో.

'సరే, అలాగే' అన్నాను.

ఆ రోజంతా చిన్ననాటి కబుర్లు చెప్పుకున్నాం మధ్యాహ్నం భోజనాలు అయ్యేంతవరకు. తరువాత ఓ రెండు గంటలు నిద్రపోయి లేచాం. కమల అందించిన టీ తాగుతూ ఉంటే 'రేపు తెల్లవారుఝామున చాలా చలిగా ఉంటుంది. నువ్వేమైనా స్వెట్టర్ గట్రా తెచ్చావా?' అని అడిగాడు కిషోర్.

'లేదే' అన్నాను.

'సర్లే. మావి ఇస్తాం' అన్నాడు.

'అసలు ఇండియాలోనే మంచి స్వెట్టర్లు దొరుకుతాయంటారు. ఇక్కడ కొని పట్టుకువెళితే బాగుంటుంది కదా!' అంది చిత్ర.

'అవును. అది మంచి ఐడియా' అని చిత్రతో అని, 'కిషోర్ సాయంత్రం అలా ఊళ్ళో తిరిగి వచ్చినట్లుంటుంది, ఏదైనా స్వెట్టర్లు అమ్మే షాపుకి తీసుకువెళ్ళు' అన్నాను.

'పరదేశీబాబు అన్న పేరుతో ఓ పెద్ద బట్టల షాపు ఉంది. అందులో మంచి స్వెట్టర్లు దొరుకుతాయి' అన్నాడు కిషోర్.

'అదేమిటి? ఆ పేరు అలా ఉంది?'

'అవును. కొంచెం వింత పేరే! కానీ మంచి పేరున్న షాపు. అక్కడ బేరాలు ఉండవు. మంచి నాణ్యమైన బట్టలు. పైగా షాపుకు వచ్చిన వాళ్ళందరినీ వాళ్ళ అభిప్రాయాన్ని రాసి సంతకం పెట్టమంటారు. అలా చేసినందుకు ఓ మంచి పెన్ను ఇస్తారు.'

ఆరు గంటలకల్లా అందరం తయారై ఊరిమీద పడ్డాం. ఇరవై ఏళ్ళ తరవాత మళ్ళీ ఈ ఊరు చూస్తున్నాను. ఇదివరకు విశాలంగా అనిపించిన రోడ్లు ఇప్పుడు, జనాభా పెరుగుదలవల్ల కాబోలు ఇరుకుగా అనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా మనుషులే. చిన్నచిన్న దుకాణాలే. ఇరుకు అన్న భావం మనసంతా ఆవరించింది.

ఓ రెండు గంటలు ఊరంతా తిరిగి, సుమారు ఎనిమిది గంటలకు 'పరదేశీ బాబు' అన్న పేరు పెద్ద పెద్ద అక్షరాలతో, అధునాతన పద్ధతిలో అలంకరించబడి ఉన్న ఓ విశాలమైన షాపులో అడుగుపెట్టాం. అడుగు పెట్టీ పెట్టగానే ఓ అందమైన అమ్మాయి ఎదురు వచ్చి వినయంగా ఆహ్వానించింది. ఏ బట్టలు కొనడానికి వచ్చేమో అడిగి వాటి కోసం ఎటువైపు వెళ్ళాలో చూపించి, అవి కొనడం అయిన తరువాత షాపు అంతటినీ చూడమని కోరింది. కాష్ కౌంటర్లకి ఓ 20 అడుగులకు ముందుగా ఉన్న ఓ టేబుల్ చూపించి, ఇక్కడ మా అభిప్రాయాలను షాపు విడిచి వెళ్ళే ముందు రాసి సంతకం పెట్టమని 'పరదేశీబాబు' తరఫున ప్రార్థిస్తున్నాను అని చక్కనైన ఇంగ్లీషు ఉచ్చారణతో భాషా దోషాలు లేకుండా చెప్పింది. అది విని ఆశ్చర్యపోయాను.

'ఇంత మంచి ఇంగ్లీషా?' అన్నాను ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ.

'ఈ షాపులో పనిచేసేవాళ్ళు ఒరియాతోపాటు రెండు మూడు భాషలు మాట్లాడతారు. అందరూ ఇంగ్లీషు మాట్లాడతారు. అదీ చాలా చక్కగా' అన్నాడు కిషోర్ ప్రశంసాపూర్వకంగా.

కావల్సిన స్వెట్టర్లు తీసుకొని, షాపంతా తిరిగి చూసి, బిల్లు చెల్లించడానికి కాష్ కౌంటర్ల వైపు కదిలాం. ఎదురుగా 'ఈ షాపుపై మీ అభిప్రాయాలను తెలియజేయండి' అని 12 భారతీయ భాషల్లో పెద్ద అక్షరాలతో రాసి ఉన్న బోర్డు, దాని పక్కనే ఓ టేబులు, టేబులు వెనుక నవ్వు మొహంతో కూర్చొని ఉన్న అమ్మాయి కనిపించింది. ఆ టేబుల్ దగ్గరకు రాగానే, 'మీ అభిప్రాయం ఇక్కడ రాసి పెట్టండి' అని వినయంగా ఓ పుస్తకాన్ని అందిస్తూ అడిగింది.

'అలాగే' అని 'ఎక్సలెంట్' అని రాసి సంతకం పెట్టాను. నా సంతకం పక్కనే చిత్ర కూడా సంతకం పెట్టింది. కిషోర్, కమల ఇంతకు ముందే రాశాం అని చెప్పారు. ఆ అమ్మాయి వెంటనే రెండు పెన్నులు తీసి నాకు, చిత్రకి ఇచ్చింది. అవి తీసుకొని కాష్ కౌంటర్ల వైపు వెళ్ళాం. అక్కడ మా కంటే ముందుగా వచ్చి నిలబడ్డవారి వెనుక క్యూలో నిలబడ్డాం. అలా నిలబడే షాపంతా కలియజూశాను. షాపంతా చాలా అందంగా అమర్చారని అనిపించింది. అభిప్రాయ సేకరణ టేబుల్ దగ్గర కూర్చున్న అమ్మాయి ఆమె చేతిలో ఉన్న కాగితంలోకి, అభిప్రాయం సేకరించిన పుస్తకంలోకి పదేపదే చూస్తున్నట్లు గమనించాను. ఉన్నట్టుండి ఆ అమ్మాయి ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి, పరిగెత్తుకుంటూ షాపులో భాగంగా ఉన్న పై అంతస్థుకు చేరుకొంది. షాపులో ఉన్న వాళ్ళందరి దృష్టి పరిగెత్తుతున్న అమ్మాయి మీదే ఉంది. కొద్ది క్షణాలలో పై అంతస్థులో 'ఆఫీస్' అని రాసి ఉన్న తలుపు తీసుకొని లోపలికి వెళ్ళింది. కొద్ది క్షణాలు గడిచాయి. ఎవరి పనులు వారు చెయ్యడం మొదలుపెట్టారు. మేం బిల్లులు చెల్లించడానికి ముందుకు కదిలాం. క్యాషియర్ మేం అందించిన రసీదు తీసుకొని, చెల్లించవలసిన సొమ్ము చెప్పి టకటక రాయడం మొదలుపెట్టింది. నేను పర్సు తీసి డబ్బులు లెక్కపెడుతున్నాను. అప్పటిదాకా చకచక పనిచేస్తున్న క్యాషియర్ పని ఆపి, ఒక్క ఉదుటున లేచి నిలబడింది.

'ఏమైంది?' అని అడిగాను.

'మేడం' అంది.

నేను వెనక్కి తిరిగి చిత్ర వైపు చూసేంతలో నా పక్కగా నాలుగు అడుగుల దూరంలో ఏ భావం వ్యక్తం చెయ్యకుండా అన్ని భావాలను ఇముడ్చుకొందా అన్నట్లు అనిపించే విశాలమైన మొహంతో, యూనివర్సిటీ రోజులలో ఎన్సిసి ఆఫీసర్‌గా ఉన్న అంజలిని శర్మని గుర్తుకు తెప్పించే ఓ అమ్మాయి రెండు చేతులు జోడించి నిలబడి నన్ను చూసి 'నమస్తే' అంది. ఆమె వెనుకగా అభిప్రాయం తీసుకొన్న అమ్మాయి మేం అభిప్రాయం రాసిన పుస్తకం పట్టుకొని నిలబడి ఉంది. నేను కొద్దిగా తడబడుతూ ప్రతి నమస్కారం చేశాను.

'ఈ సంతకం మీదేనా?' అని ఆ పుస్తకంలో ఉన్న నా సంతకం వైపు వేలు చూపిస్తూ అడిగింది. నా కోసం వాళ్ళు వెతుకుతున్నారన్న ఆలోచన నన్ను కొద్దిగా ఆశ్చర్యంతో నన్ను కలవరపెట్టింది.

'అవును' అన్నాను మెల్లిగా.

'మీరు 20 సంవత్సరాల క్రిందట భువనేశ్వర్ వచ్చారు కదూ!' అని అడిగింది.

'ఆ... అవును సుమారుగా...'

'ఈ కాగితంపై ఉన్న సంతకం కూడా మీదేనా' అని పటం కట్టి ఉన్న నా సంతకం ఫొటో కాపీని చూపించి అడిగింది.

ఆ కాగితం మీదున్నది నా సంతకమే. సులభంగానే గుర్తుపట్టాను. సంభాషణ అంతా ఇంగ్లీషులోనే సాగుతోంది.

'అవును' అన్నాను నిశ్చయంగా.

'బాబూజీ!' అని ఆ షాపంతా ప్రతిధ్వనించేలా ఒక్కసారి అరిచి, చటుక్కున నా కాళ్ళపై పడి, తన చేతులతో నా రెండు కాళ్ళని చుట్టేసింది. ఉద్వేగంగా అంటోంది. అర్థమవడంలేదు.

నన్ను ఆశ్చర్యం, ఉద్వేగం ఒక్కసారి ఆవరించి గాభరా పెట్టాయి. ఆ స్థితిలోనే 'లేవండి లేవండి అలా కాళ్ళమీద పడకూడదు. అసలు విషయం ఏమిటి? ఏం జరిగింది? నా కోసం ఎందుకు వెతుకుతున్నారు? మీరెవరో నాకు తెలీదు' అన్నాను.

ఆమె నా కాళ్ళు వదలకుండానే 'ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్నాను. లక్ష సంతకాల తరువాత మీ సంతకం కనిపించింది. మీరు దొరికారు. నేను మిమ్మల్ని వదలలేను. నా తనివితీరా నా మనస్సులో ఇన్నేళ్ళుగా దాచుకొన్న నా కృతజ్ఞతని మీకు తెలుపుకోవాలి బాబూజీ! బాబూజీ!' అంటూ ఆవేశంగా పరిసరాలని మరిచి, వదిలితే ఎక్కడ జారిపోతాయో అన్నంత గట్టిగా నా కాళ్ళను పట్టుకొంది.

నేను నిస్సహాయంగా నిలబడి సహాయం కోసం మా ఆవిడ వైపు చూశాను. నా చూపును అర్థం చేసుకున్న దానిలా ముందుకు వచ్చి నా కాళ్ళ దగ్గర ఉన్న ఆ అమ్మాయిని తన చేతులతో పట్టుకొని మీదకు లేపి నిలబెట్టింది. కానీ ఆ అమ్మాయి ఇంకా ఉద్వేగంతో చిత్ర భుజంపై వాలింది. షాపులో ఉన్నవాళ్ళంతా మా చుట్టూ మూగారు.

ఆ సంతకం నా సంతకమేనా? నా సంతకానికి పటం కట్టి ఉంచడమేమిటి? ఆ సంతకానికి ఈ అమ్మాయికి సంబంధం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరయి పోయాను.

ఇంతలో ఆ షాపు స్టాఫ్ తేరుకొని, చిత్ర భుజంపై వొరిగి ఉన్న అమ్మాయిని మా నలుగురిని పై అంతస్తులో ఉన్న ఆఫీసు గదిలోకి తీసుకువెళ్ళారు. ఆ ఆఫీసు గది ముందు అనుపమ పట్నాయక్ ఎం.ఏ. మేనేజింగ్ డైరెక్టర్ అని రాసి ఉన్న బోర్డు ఉంది. లోపల కుర్చీలతో, సోఫాలతో అధునాతన పద్ధతిలో అమర్చిన విశాలమైన ఆఫీసు. ఎడమ వైపున్న సోఫాలో కూర్చోమని సూచించారు. ఆ సోఫాకు ఎదురుగా ఉన్న సోఫాలో ఆ అమ్మాయిని కూర్చోబెట్టారు. అంతలోనే మంచినీళ్ళు, వేడి టీ వచ్చాయి. అందరికీ అందించారు. ఆమె ముందుగా కొంచెం మంచినీళ్ళు తాగి, తేరుకొని స్టాఫ్ ఇచ్చిన తువ్వాలుతో ముఖం తుడుచుకొని, నా మొహంలోకి చూస్తూ 'మీరు ఇరవై ఏళ్ళ క్రితం భువనేశ్వర్ వచ్చారు గుర్తుందా?' అని నా జ్ఞాపకాలని గుర్తు చెయ్యడానికి ప్రయత్నిస్తున్న దానిలా అంది. 'మీరు మా నాయన కూరల దుకాణానికి వచ్చారు...' ఏమేమో చెబుతోంది. ఇరవై ఏళ్ళ కిందట భువనేశ్వర్ వచ్చినపుడు జరిగిన విశేషాలని గుర్తు తెచ్చుకొనేందుకు ప్రయత్నించాను.

నేను ఉద్యోగ ప్రయత్నం మీద ఇంటర్వ్యూ కోసం భు... వచ్చాను. కోణార్క్ కూడా చూద్దామని అనుకున్నాను. కాని వెళ్ళలేదు ఎందుచేత...?

అప్పుడు భువనేశ్వర్ ఇంత పెద్ద ఊరు కాదు. జనం బాగా తక్కువ. ఊరు విశాలంగా ఉన్నట్లు గుర్తు. కిషోర్ ఓ చిన్న గదిలో అద్దెకు ఉండేవాడు. నేను నాలుగు రోజులు ఉందామని కూడా వచ్చాను. అపుడు 'మదరాసీ' హోటళ్ళు లేవు. కిషోర్ ఒరియా భోజనానికి అలవాటుపడ్డా, నా కోసం ఇంట్లోనే వంట చేసేవాడు. ఇంటర్వ్యూ అయిన నాటి రోజు సాయంత్రం సామాన్లు, కూరలు కొనడానికని బజారుకు వెళ్ళాం.

'బాబూజీ' గౌరవం, ఆప్యాయత మేళవించి పిలిచిన ఆ పిలుపునకు నా ఆలోచనలు తెగిపోయాయి. 'చిన్న వయసులో చింపిరి తలతో, చీమిడి ముక్కుతో, చిరిగిన బట్టలతో, మట్టి కొట్టుకుపోయిన వంటితో, చదవలేక, చదువు రాక, చదువుకోమనే దెబ్బలతో, ఏడుపుతో, కన్నీళ్ళు నిండిన కళ్ళతో గుర్తుకు వచ్చానా?' అని తోరదత్ పాయత్రీ లాంటి భాషలో ఇంగ్లీషులో అడిగింది. మెల్లిమెల్లిగా కూరగాయల తట్టల మధ్య కూర్చుని ఉన్న ఓ చిన్నపిల్ల గుర్తుకు వచ్చింది. పూర్తిగా గుర్తుకు రాగానే ఎదురుగా కూర్చొని ఉన్న ఆమె కన్నీళ్ళు నిండిన కళ్ళతో చూశాను. చక్కని సంప్రదాయపు కేశాల కూర్పుతో, మిసమిసలాడుతున్న చెంపల మీద, మెరుస్తున్న కన్నీటి తడితో, ... ఎరుపు రంగు మేలు మేళవింపుతో, మగ్గాన నేసిన మంచి చీరలో, వయసు తెచ్చి ఇచ్చిన వన్నె వెలుగుతో మెరుస్తున్న మేనుతో, ఈమె చదవనిది లేదేమో అని అనిపించే భాషాజ్ఞానంతో, భావోద్వేగాన్ని ప్రజ్వలిస్తున్న కళ్ళతో ఉన్న ఈమె ఆ పిల్లా? నా కళ్ళ ముందే అందమైన సీతాకోక చిలుక అప్పుడే రెక్కలు విచ్చుకున్న భ్రాంతి కలిగింది. మసక వెలుతురులో 30-35 సంవత్సరాల వ్యక్తి. అతనికి ఎదురుగా ఓ 6-7 ఏళ్ళ అమ్మాయి, చుట్టూ కూరగాయల తట్టలు ఒకదాని తరవాత మరొకటి గుర్తుకు వస్తున్నాయి. పిల్ల ఏడుపు వినిపిస్తున్నాది. ఏడుపు మధ్యలో ఏదేదో ఒరియాలో అంటున్నాది. అతని తండ్రి కాబోలు కొడుతున్నాడు. కొడుతూ అరుస్తున్నాడు. ఒరియా భాష రాకపోవడంవల్ల ఏమీ అర్థం కావడంలేదు. తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది. కిషోర్ సామాన్లు కొనడం పూర్తయిన తర్వాత ఆ ఏడుస్తున్న పిల్ల ఉన్న కూరల దుకాణానికి వెళ్ళాం. ఆ పిల్లని, తండ్రిని దగ్గరగా చూట్టం జరిగింది. మేం రాగానే అతను పిల్లను కొట్టడం ఆపి మా వైపు తిరిగి కూరలు ఏరుకొందుకు తట్ట అందిస్తూ, పిండి తీసుకొని మొహానికి రాసుకున్న తీరులో, నవ్వు తీసుకొని మొహానికి పులుముకున్నాడా అన్నట్లు నవ్వాడు ఒక్క క్షణంసేపు.

(మిగతా 29వ పేజీలో)

# వెలుతురు చినుకులు

రావూరి భరద్వాజ



'నాకు మంచి భోజనం కావాలి. మంచి దుస్తులు కావాలి. మంచి వసతి కావాలి. మంచి విద్య కావాలి.
కాని—
ఒకప్పుడు నేననుభవించిన ఆకలిని;
ఒకప్పుడు నేను చుట్టుకొన్న మురికి పీలికలను;
ఒకప్పుడు నేను భరించిన ఎండా వానలను;
ఒకప్పుడు నేను తలవొంచుకొన్న సందర్భాలను;
మరిచిపోయే స్థాయిలో మాత్రం, నాకేమీ అవసరంలేదు!

*(28వ పేజీ తరువాయి)*ఆ పిల్ల మేం దగ్గరకు రాగానే ఆపలేక ఆపలేక ఆపినట్లు ఏడుపు ఆపింది. అయినా మధ్య మధ్యలో బెక్కుతూనే ఒరియాలో ఏదో అప్పజెపుతున్నట్లు చెపుతోంది. విరిగిపోయిన పలక, చిరిగిపోయిన పుస్తకం... ఆ తండ్రి నలిగిన బట్టలతో, రేగిన జుత్తుతో, ముడతలు పడ్డ నుదురుతో, కాయకష్టం చేసి రాటుదేలిన చేతులతో, నిర్భాగ్యపు బతుకుకు నకలుగా, నిరాశ ముద్దలలాంటి కళ్లతో, మాసిన గడ్డంతో, బతుకు మీదో వ్యా రం మీదో పిల్లదాని చదువు మీదో మనుషుల మీదో లేక వీట న్నిటిమీదో, దీని మీద అని నిర్దిష్టంగా చెప్పలేని కసి, కోపం అతని మొహమంతా మబ్బులా కమ్మేసింది.

కూరలు కొనడం అయిపోయిన తరవాత రూమ్‌కి వస్తుంటే కిషోర్‌ని అడిగాను. 'ఆ పిల్ల ఎందుకు ఏడుస్తోంది? ఆ తండ్రి ఎందుకు కొడుతున్నాడు? చదువుకోవడం లేదు అనేనా?'

'ఆ! సుమారుగా అంతే. పుస్తకాలు కొనకుండా బడికి రావద్దన్నారని, అందుచేత పుస్తకాలు కొనమంటుంది. బడిలో అందరూ మంచి బట్టలు కట్టుకు వస్తున్నారని, తనకు అలాంటి బట్టలు కావాలని, ఆ పిల్ల ఎక్కాల పుస్తకం కొన్నా ఇంకా ఎక్కాలు రాలేదని, పుస్తకాలు కొనడానికే డబ్బులు చాలక పోతుంటే, ఇంక మంచి మంచి బట్టలు ఎక్కడ నుంచి తేగలనని ఆ తండ్రి అంటున్నాడు. నీకూ చదువబ్బదు, నాలాగా ఈ కూరల తట్టే గది. నా బతుకు ఈ కూరల తట్టల మధ్యనే తెల్లారుతోంది అని తిట్టుకుంటున్నాడు' ఆ కబుర్లలో రూంకి వచ్చాం. రాత్రి ఆ పిల్ల ఏడుపు గుర్తువచ్చి మెలకువ వచ్చింది. ఆ తరవాత నిద్రపట్టలేదు. ఆ పిల్ల మొహం పదేపదే గుర్తుకు వచ్చి 'చదువంటే డబ్బులని' స్కూల్లోనూ 'చదువంటే దెబ్బలని' ఇంట్లోనూ ఒక దురభిప్రాయాన్ని ఆ చిన్నారి మనసులో నాటుతుంటే నాకు చాలా బాధ కలిగింది. ఆ పిల్లకి ఎలాగైనా చదువుకోవాలనే ఆసక్తి కలిగించాలని ంచింది. ఆ ఊరిలో ఇంకా ఉండేది ఒక్కరోజు మాత్రమే. ఎల్లుండు కోణార్క వెళ్ళాలని అనుకున్నాను. ఆలోచిస్తూ ఎప్పుడో తెల్లవారుజామున నిద్రపట్టింది.

మర్నాడు ఉదయం కిషోర్ నిద్రలేపాడు. కోణార్క్ వెళ్ళడానికి ఆలస్యం అయిపోతోందన్నాడు.

'కోణార్క్ వెళ్ళడంలేదు' అన్నాను నేను లేచి.

'అదేం?' అన్నాడు. 'మరేం లేదు. నా దగ్గర 200 రూపాయలే ఉన్నాయి. అవి పెట్టి ఆ పిల్లకి కావల్సిన పుస్తకాలు, బట్టలు కొని ఇచ్చి చక్కగా చదువుకోమని చెప్పాలనుకుంటున్నాను' అన్నాను.

'ఏ పిల్ల? ఆ కూరగాయల కొట్టతని పిల్లా?'

'అవును' అన్నట్టు బుర్ర ఊపాను.

'మరి కోణార్క్ ప్రయాణం...' అన్నాడు కిషోర్.

'ప్రయాణం అంత ముఖ్యం కాదు. విపరీతంగా వెనకబడి ఉన్న మన దేశాని అక్షరాస్యత అత్యంత అవసరం. ఆడపిల్లలు చదువుకుంటే ఆమె పిల్లలు నిరక్షరాస్యులవ్వరు. ఆ కుటుంబం నిరక్షరాస్యత నుండి బయటపడుతుంది. కాబట్టి, నేను కోణార్క్ వెళ్ళడంకన్నా అదే డబ్బుతో ఆ పిల్ల చదువుకి ఉత్ప్రేరకంగా తోడ్పడం మంచిదని ఈ నిర్ణయం తీసుకున్నాను' అన్నాను.

కిషోర్ తెల్లబోయి చూస్తున్నాడు.

'నువ్వు ఆఫీసుకు వెళ్ళే దారిలో ఉన్న ఏదైనా ఒక పుస్తకాల షాపు దగ్గర నన్ను విడిచిపెట్టు. ఆ తరవాత అక్కడ దగ్గరలో ఉన్న బట్టల దుకాణానికి వెళ్ళి బట్టలు కూడా కొని సాయంత్రం ఆ పిల్లకి ఇచ్చి వద్దాం' అన్నాను.

సాయంత్రం మళ్ళీ ఆ కూరల దుకాణానికి వెళ్ళి ఉదయం కొన్న ఒరియా, ఇంగ్లీష్ పుస్తకాలు, పెన్సిళ్ళు, ఓ రెండు పెన్నులు, కొన్ని రబ్బర్లు, బట్టలు ఇచ్చి 'చదువుకో! బాగా చదువుకో! చాలా పెద్దదానివి అవుతావు. నీకు కావలసినవి అన్నీ దొరుకుతాయ' అని ఒరియాలో కిషోర్ చేత చెప్పించి, అవే మాటలని కిషోర్ చేత ఒరియాలో రాయించి కింద నా సంతకం పెట్టి ఇచ్చాను. వాళ్ళు ఒరియాలో అన్న వాటిని 'కృతజ్ఞత'లని కిషోర్ నాకు తెలుగులో తరువాత చెప్పాడు. ఆ తరవాత ఏం జరిగిందో మరి తెలీదు. 'ఆ పిల్లే ఈ పిల్లా?' అని ఆమె మొహంలోకి చూస్తూ, 'అవును. అప్పుడు కొన్ని పుస్తకాలు ఇచ్చినట్లు గుర్తు' అన్నాను.

'బాబూజీ! ఇవిగో ఆ పుస్తకాలు' అని ఎదురుగా ఉన్న అందంగా నగిషీ చెక్కిన పెట్టెలోంచి కొన్ని పాత పుస్తకాలు తీసి కళ్ళకు అద్దుకొని నా ఎదుట పెట్టి, 'ఆ రోజు మీరిచ్చిన ఈ పుస్తకాలు నాకు వరాలు. అప్పటి నుండి శ్రద్ధగా చదువుకున్నాను. నా నాయన నా హైస్కూల్ చదువు పూర్తి కాగానే బట్టల వ్యాపారం మొదలుపెట్టించాడు. మీ మాటల మీది గురితో ఏర్పడ్డ చదువు మీది అభిమానం నన్ను వదలలేదు. ఉదయం వ్యాపారం, సాయంత్రం చదువు. చదువుతున్నకొద్దీ చదువు ఇచ్చే ఆనందాన్ని ఆస్వాదించసాగేను. వ్యాపారంలో కూడా నా చదువు చాలా ఉపయోగపడటం చూసి మా నాయన నన్ను చదువుకోమని ప్రోత్సహిస్తూ ఉండేవాడు. అలా ఎం.ఏ. దాకా చదివాను' అని లేచి, గోడకు తగిలించి ఉన్న ఉత్కల్ యూనివర్సిటీ డిగ్రీ సర్టిఫికెట్లను తెచ్చి చూపించింది.

'మిమ్మల్ని లెక్కపెట్టలేనన్ని సార్లు తలచుకొని ఉంటాను. పరీక్షలు పాసయినపుడల్లా ఇదంతా మీ దయ వల్లనే అని అనుకుంటుంటాను. మీ పట్ల నాకున్న కృతజ్ఞత ఎలా తెలుపుకోవాలో అని చాలా రోజులు ఆలోచించి, ఆఖరుకు మీ కిష్టమైన పనే చేశాను. చూడండి' అని ఓ ఆల్బం తెరిచి గత పదేళ్ళుగా ఏడాదివారీగా అమర్చిన ఆడపిల్లల గ్రూప్ ఫొటోలని చూపించి 'ప్రతీ ఏడాది సుమారు వంద మంది చదువుకోడానికి స్తోమత లేని వారిని చదివిస్తున్నాం. వాళ్ళని తిరిగి పెద్దవాళ్ళయ్యాక కనీసం పది మందిని చదివించమని కోరుతున్నాం. ఇది మీకు ఆనందాన్ని ఇస్తుందనుకుంటాను బాబూజీ!'

'నిజంగానే మంచి పని. చాలా ఆనందంగా ఉంది' అన్నాను చెమర్చిన కళ్ళతో.

'బి.ఏ. పాస్ కాగానే మిమ్మల్ని కలవాలన్న కోరిక అతిగట్టిగా అనిపించింది. మీ సంతకం ఉంది గానీ, మీ పేరు తెలీదు. ఒరియా వాళ్ళు కాదని మాత్రం తెలుసు. మిగిలిన ఆశ ఒక్కటే. మీరు మళ్ళీ భువనేశ్వర్ వచ్చి మా షాపుకి వచ్చినట్లయితే ఈ సంతకం ద్వారా మిమ్మల్ని కలవవచ్చు అని తోచి ఈ సంతకాల పద్ధతి పెట్టాం. మా నాయన కూడా మిమ్మల్ని కలవాలని చాలా ఎదురుచూశాడు. అనారోగ్యంతో మంచం మీద ఉన్నా మీరు దొరికారా అని అడుగుతుండేవాడు. చనిపోయే ముందు కూడా మిమ్మల్ని గుర్తు చేసుకొని ఎప్పుడైనా కలిస్తే తన తరపున కూడా మీకు పాదాభివందనం చెయ్యమన్నాడు' అని ఉద్వేగంతో నా కాళ్ళకి మరోసారి నమస్కారం పెట్టింది.

నా నిలువెల్లా ఆనందాశ్చర్యాలతో ముంచెత్తబడుతున్న ప్రకంపనాలు పదేపదే ప్రవహిస్తున్నాయి. మాట్లాడాలని ఉంది కానీ గొంతు నుండి మాటలు రావడంలేదు. గత 20 ఏళ్ళుగా విదేశాలలో పనిచేస్తూ సంపాదించిన పురస్కారాలన్నింటి కంటే ఆమె చేసిన నమస్కారం అత్యున్నతమైనదిగా తోచింది. ఆ రోజు చేతిలో ఉన్న 200 రూపాయలు ఈ పిల్ల చదువుకు ఖర్చు చెయ్యడం కంటే మంచి పని నా జీవితంలో ఇంకేమీ లేదేమో అనిపించింది. అయితే ఆ అమ్మాయి తన జీవితంలో ఇంత ఎత్తు ఎదగడానికి కారణం నేనే అని, ఆ గొప్పదనం నాకే ఆపాదించబడటం అంత సబబు అనిపించలేదు. అందుకే నోరు విప్పి 'నీ పట్టుదల, కృషి, మేధతో, విశాల దృక్పథంతో ఈ స్థితికి వచ్చావు. కాని నా పాత్ర ఇందులో ఉత్ప్రేరకంగా పనిచెయ్యడం మాత్రమే. నువ్వు చాలా అభినందనీయురాలవు. ఎంతోమంది ఆడపిల్లలకి నువ్వు మార్గదర్శకురాలివి. అటువంటి నీ అభిమానానికి ఎంతో ఆనందిస్తున్నాను' అన్నాను ప్రతీ పదాన్ని నొక్కి పలుకుతూ.

మేం ఇద్దరం ఇలా మాట్లాడుకుంటూ ఉంటే అంతా మమ్మల్నే చూస్తున్నారు అన్న ఊహ అప్పుడే కలిగింది.

'బాబూజీ! మీరు మా ఇంటికి రావాలి. మాతోనే ఉండాలి. ఇన్నేళ్ళుగా నా మనసులో మీతో చెప్పుకుంటున్న మాటలన్నీ మీతో చెప్పాలి.'

'అలాగే' అన్నాను.

'మరి కోణార్క్ వెళ్ళడమో...' అన్నాడు కిషోర్.

'రేపు కోణార్క్ వెళ్ళాలనుకొంటున్నారా?! రేపొక్కసారి మానుకొని మరోసారి వెళ్ళకూడదా?' అని ప్రశ్నలాంటి అభ్యర్థన చేసింది అనుపమ పట్నాయక్.

'అలా అయితే ఇది 20 ఏళ్ళ తరవాత మరోసారి అవుతుంది' అన్నాడు కిషోర్.

ఎలా అన్న ఆమె ప్రశ్నకు సమాధానంగా 20 ఏళ్ళ కిందట నేను కోణార్క్ ఎందుకు వెళ్ళలేదో చెప్పాడు.

అది విని అనుపమ పట్నాయక్ మౌనంగా, నీళ్ళు నిండిన కళ్ళతో కృతజ్ఞతతో మరోసారి చూసింది.

ఆ రాత్రి అందరం అనుపమ పట్నాయక్ కోరికపై ఆమె అతిథులమైనాం.

★ ★ ★

నేను వంటింట్లో చెయ్యవలసిన సహాయం చేసి వచ్చేసరికి పతంజలి నేనిచ్చిన కథ చదవడం పూర్తిచేసి నా కోసం ఎదురుచూస్తున్నాడు.

'ఇప్పుడేమంటారు?' అన్నాను. అతను అందిస్తున్న కాగితాలను అందుకుంటూ.

'సంకల్పం. ఆచరణ ముఖ్యం. మరి నేను వెళ్ళి మా గ్రూప్‌లో జాయిన్ అవ్వాలి. థేంక్స్' అన్నాడు అతను.

'మంచిది' అన్నాను తృప్తిగా.

★